క్లుప్తంగా

వైఎస్సార్ సీపీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి



తాడేపల్లిరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి అని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ విషం చిమ్ముతోందని, తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని ప్రధాన నేతలే ప్రకటించడం మైనార్టీలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అన్ని విధాలుగా వెనుకబడిన ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న బీజేపీతో లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న టీడీపీ, జనసేన జతకట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముస్లిం సమాజం మొత్తం కూటమికి ఓటుతో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు.

రూ.1.20 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: ఎలాంటి రసీదులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం కంతేరు శ్రీ సిటీ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన వరగాని భాను చందర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రూ.1.20 లక్షల నగదు పెట్టుకొని వెళ్తుండగా తనిఖీలు నిర్వహించారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేని కారణంగా తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఐటీ అధికారులకు పంపించినట్లు సీఐ తెలిపారు.

ప్రతి ఓటరూ ఓటు వేసేలా చూడాలి

మంగళగిరి: ప్రతి బూత్‌లోను ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న కన్వెన్షన్ సెంటరులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో ఓటు హక్కు ఉన్న వారందరు వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి ప్రజలకు చేరువైందని, రానున్న ఎన్నికల్లో ప్రజల ఆదరణతో ఆయన మళ్లీ సీఎం కావడంతో పాటు మంగళగిరి నియోజకవర్గంలో మురుగుడు లావణ్య విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడేపల్లి మంగళగిరి, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, బుర్రముక్క వేణుగోపాల స్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పట్టణ , రూరల్ జేసీఎస్ కన్వీనర్లు ఎండి ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి నాయకులు సంకె సునీత, ఈపూరి ఆదామ్, బేతపూడి నరసయ్య పాల్గొన్నారు.

నేడు 27వ వార్డులో లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య సోమవారం ఉదయం పట్టణంలోని 27వ వార్డు రాజీవ్ గృహకల్ప, పావురాల కాలనీల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4 గంటలకు ఉండవల్లి సెంటర్ నుంచి ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నారా లోకేష్ ప్రచారం

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం గొడవర్రులో ఆదివారం మంగళగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. వృద్ధులకు ప్రస్తుతం 3 వేలు ఉన్న పెన్షన్‌ను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4 వేలకు పెంచుమని, వలంటీర్ వ్యవస్థ ద్వారానే వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందించే బాధ్యత తమదని నారా లోకేష్ అన్నారు.

1న కవి సమ్మేళనం

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం సుభాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ ఆవరణలో సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ప్రముఖ సాహితీ వేత్త తోటకూర వెంకటనారాయణ, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

చెప్పింది చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

- మేనిఫెస్టోను దైవంగా భావించి అమలు చేస్తాం
- మన అమ్మాయి.. మన లావణ్యను గెలిపించండి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పిలుపు



ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య

మంగళగిరి: చెప్పింది చేసి, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని మూడవ వార్డులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఎమ్మెల్యే ఆర్కే ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో మూడు శాఖల మంత్రిగా ఉన్న లోకేష్, ఇదే నియోజకవర్గంలో నివాసం ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. ఇప్పుడు మరలా గెలిపిస్తే తాము సింగపూర్ చేస్తాం.. గచ్చిబౌలి చేస్తాం అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ మాటలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. బీసీ మహిళ మురుగుడు లావణ్యను ఓడించేందుకు లోకేష్ డబ్బు సంచులతో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అమాయకులు కాదని, లోకేష్‌కు మరలా ఓటమి తప్పదన్న విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, మాజీ యార్డు చైర్మన్ సుంకర రఘుపతిరావు, నాయకులు పచ్చల శ్యాంబాబు, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, తాడిబోయిన సురేష్, అరంజ్ అంజి, రామకృష్ణారెడ్డి, రంగిశెట్టి పెద్దబ్బాయి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి నోట జగన్ నామస్మరణే

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చినపాలెం, పెదపాలెం, శృంగారపురం గ్రామాల్లో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా మురుగుడు లావణ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి ఎక్కడి నుంచో గెస్ట్ లాగా వచ్చి, డబ్బులతో పెత్తనం చేయాలనుకుంటున్న ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి మీటింగ్‌లోనే తమ సమస్యలను పరిష్కరించేది, గెలిచేది వైఎస్సార్ సీపీ అని.. జగనన్న జిందాబాద్, ఆయన నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ చెప్పిందే చేస్తారని, వంద హామీల్లో 99 తుంగలో తొక్కి, రెడ్ బుక్ రాస్తున్నానని బెదిరించే నాయకుల్లా హామీలు ఇవ్వడం ఆయనకు తెలియదన్నారు. వార్డు మెంబరుగా గెలవలేని వ్యక్తులు ఇప్పుడు ప్రజల మద్దతు ఉన్న జగనన్నను విమర్శించడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని అని చెప్పుకుంటూ ఎటువంటి అభివృద్ధి లేకుండా వారి వ్యాపారాలు నిర్వహించుకుని, జేబులు నింపుకున్నారని, సీఆర్డీఏ పరిధి అంటూ మంగళగిరి అభివృద్ధి జరగకుండా అడ్డుకున్నది టీడీపీ అని ఘాటుగా విమర్శించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగిరిలో ఎప్పుడూ గతంలో జరగని అభివృద్ధి చేసి, చూపించారన్నారు. రాజధాని ముఖ ద్వారమైన రహదారులు కూడా బాగుచేయలేని పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. సీఆర్డీఏ చట్టాలను మార్చి, రాజధాని పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. రాబోయే కాలంలో తెనాలి – మంగళగిరి రోడ్డును, రేపల్లె కనకదుర్గ కరకట్టను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శృంగారపాటి రత్నం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు , జిల్లా సభ్యులు రజనీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, సీనియర్ నాయకులు వీరయ్య, ఎంపీటీసీలు కొండూరు సుభాని, సుబ్బారావు, గోపాలకృష్ణ, బుల్లా జక్రయ్య, గొడవర్తి యలమంద, ప్రసాద్, తిమోతి సుబ్బారావు, పోతురాజు, బుల్లా శ్రీను, ముప్పాల సుబ్బారావు, పి. శ్రీను, శృంగారపాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో అభ్యర్థి లావణ్య, గంజి చిరంజీవి

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం(మహా మంజీరనాదం-2024) ఆదివారం ఆరో రోజుకి చేరాయి. ప్రముఖ గాయని పత్రి నిర్మలమదన్ జ్యోతిప్రజ్వలన చేయగా, సభకు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం మొహిముద్దీన్‌ఖాన్ (ప్రొద్దుటూరు) నృత్య ప్రదర్శన, అభిశ్రీ మోల్ (తిరువనంతపురం) మోహినీ ఆట్టం, రుత్విక నలమలవు(కర్ణాటక) కూచిపూడి నాట్యం, కె.హరిప్రసాదరావు(తిరుపతి) భరతనాట్యం ప్రదర్శించారు. వారి నృత్యాలు సభికులు, ప్రేక్షకులను అలరించాయి. మొహిముద్దీన్‌ఖాన్‌కు నృత్య శిరోమణి పురస్కారం, కొందరికి యువ కళారత్న పురస్కారాలు, ఎస్‌వీ సంగీత నృత్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్.జమునారాణికి 'మరంగంటి కాంచన మాల' జీవిత సాఫల్య పురస్కారం, ప్రపంచ ప్రఖ్యాత నాట్యాచార్యుడు డాక్టర్ ఎస్.కృష్ణకుమార్‌ను పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ వైద్యులు, రచయిత్రి భార్గవి, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం, సంస్థ కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, బిక్కి అలేఖ్య పాల్గొన్నారు.

జగనన్నతోనే మాదిగల సంక్షేమం



గుంటూరు రూరల్: జగనన్నతోనే మాదిగల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాదిగ మహా సేన అధ్యక్షుడు కరిటపాటి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం అనంతరవప్పాడులో మాదిగ మహా సేన వైఎస్సార్ సీపీకి మద్దతుగా రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ప్రచారం, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాదిగ మహా సేనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగలంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు అందించిన సంక్షేమ పథకాల కర పత్రాలను అందించారు. ప్రతి మాదిగ పల్లెలో జగనన్న చేసిన మేలును తెలిపారు. మరలా మాదిగలకు మేలు జరగాలంటే జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. మాదిగ మహా సేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు కూచిపూడి గోపి, ప్రత్తిపాడు అధ్యక్షుడు ఈపూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి సుబ్బారావు, వేజండ్ల ఎరయ్య, మున్నంగి వసంతరావు, రూరల్ అధ్యక్షుడు చిలక రమేష్, ఎడ్లపల్లి శివయ్య పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

తెనాలిఅర్బన్: ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. పద్మశాలీయ యువతీ యువకులు హాజరయ్యారు. పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 246 మంది యువతీ యువకులు హాజరయ్యారని చెప్పారు. అనంతరం వధూవరుల వివరాలు తెలియజేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, సంస్థ ప్రతినిధులు మహేష్, శ్రీరామ్, దివి పురుషోత్తం, ప్రభాకర్ పాల్గొన్నారు.

రహదారులే..మంగళగిరికి మణిహారం



నగరంలోని ప్రధాన గౌతమబుద్ధా రోడ్డు





నియోజకవర్గంలో పలు గ్రామాల్లోని పొలాలకు వేసిన గ్రావెల్ రోడ్లు

- రూ.405 కోట్లతో 583 కిలోమీటర్ల రోడ్లు
- మంగళగిరి పరిధిలో ప్రాధాన్యం క్రమంగా నిర్మాణం
- రోడ్ల నిర్మాణాలను కొన్ని చోట్ల అడ్డుకున్న టీడీపీ, జనసేన
- గత టీడీపీ ప్రభుత్వంలో తట్టెడు మట్టి పోయని వైనం



జనసేన, టీడీపీ కోర్టుకెళ్లి అడ్డుకున్నా.. పూర్తి చేసుకున్న ఇప్పటం రోడ్డు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మానవ వనరుల అభివృద్ధిపై ప్రధానంగా నిధులు ఖర్చు చేస్తూ వస్తోంది. పేదలకు ఆర్థిక చేయూతనిచ్చి..వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు దృష్టి సారించింది. ఈ క్రమంలో కరోనాను ఎదుర్కోవడంలో సగం పాలన సమయం సరిపోయింది. అనంతరం ప్రాధాన్య క్రమంలో అభివృద్ధిపై నిధులు వెచ్చిస్తూ వస్తోంది. వాటిలో ముఖ్యంగా రహదారులున్నాయి.

మంగళగిరి నియోజకవర్గంలో గత ఐదేళ్లలో రూ.405 కోట్లతో 583 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ చేసి, అభివృద్ధి చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో గతంలో ఎన్నడూ లేని విధంగా మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థగా ఆవిర్భవించిన అనంతరం నగరంలో విలీనమైన గ్రామాల రోడ్లను కలపడంతో పాటు పంట పొలాల్లోని లింకు రోడ్లను, డొంక రోడ్లను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా రైతుల ప్రయాణ వెతలను తీర్చారు.

మంగళగిరి నగరంలో ఇలా..

మంగళగిరి నగరంలో రూ.373 కోట్లతో 367 కిలోమీటర్ల మేర 461 రోడ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు రూ.240 కోట్లతో చేపట్టిన 372 నిర్మాణాలు పూర్తి కాగా మరో రూ.33 కోట్లతో చేపట్టిన 89 రోడ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. దుగ్గిరాల మండలంలో రూ.41 కోట్లతో 46 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. రూ.103.84 కోట్లతో శివారు కాలనీల్లో చేపట్టిన 93.92 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తియ్యాయి. ఆర్ఎండీబీ ఆధ్వర్యంలో రూ.52 కోట్లతో చేపట్టిన 63 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

అంతర్గత రహదారులు..

నగరంలో చేపట్టిన అంతర్గత రోడ్లు 137.30 కిలోమీటర్లలో.. 33 సీసీ రోడ్లు, 30 బీటీ రోడ్ల నిర్మాణాలు రూ.83 కోట్లతో పూర్తి చేశారు. విలీన గ్రామాల్లో పంట పొలాల్లో డొంక రోడ్లతో పాటు నగర శివారు కాలనీల్లో రూ.40 కోట్లు వెచ్చించి 120 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.

పేదల కాలనీలు, రైతులకు ప్రాధాన్యం..

మంగళగిరిలో పేదల కాలనీల్లో అంతర్గత రోడ్లు, గ్రామీణ రహదారులపై ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టి సారించారు. పేదలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిధులు కేటాయించి, రోడ్లను పూర్తి చేశారు.



ఇప్పటం రోడ్డు

కోర్టులకెక్కడం..రెచ్చగొట్టడం..

గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డుకు తట్టెడు మట్టి పోయని ఆ పార్టీ నాయకులు... స్థానిక ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో జరిగిన రోడ్ల అభివృద్ధిని చూడలేక... పసలేని విమర్శలు చేస్తూ..పేపర్లు, మీడియాలోకెక్కడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డు, ఇప్పటం రోడ్డుతో పాటు పలు రోడ్లను సాంకేతిక కారణాలతో స్థానికులను రెచ్చగొట్టడం, కోర్టులకు ఎక్కి ఆ నిర్మాణాలను ఆపాలని టీడీపీ, జనసేన పన్నిన కుయుక్తులు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇప్పటం రోడ్డు విషయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కారు మీద కూర్చుని చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఇప్పుడే అదే పవన్ కల్యాణ్ అదే కారు మీద మరోసారి కూర్చుని ఇప్పటం వస్తే.. రూ.1.60కోట్లతో సుందరంగా తీర్చిదిద్దిన డబుల్ లేన్‌రోడ్డు కనిపిస్తుందని స్థానికులు అంటున్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా



నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతులతో పాటు రోడ్ల విస్తరణ ప్రధానం. ఎంటీఎంసీగా మారిన అనంతరం నగరం శరవేగంగా అభివృద్ధి చెందింది. ప్రజల అవసరాలకి అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టడం జరిగింది. గౌతమబుద్ధా రోడ్డు విస్తరణతో మంగళగిరి రూపురేఖలు మారాయి. తెనాలి రోడ్డుతో పాటు మరికొన్ని రోడ్లు విస్తరణ చేసి, అభివృద్ధి పరిస్తే నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే, మంగళగిరి

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులతో అతిథులు

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులకు శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన వేడుకకు శిశుమందిర్ సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, విద్యాపీఠం విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్ సందేశాన్ని వినిపించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు రమాదేవి స్వాగతం పలికారు. విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు. విద్యాకమిటీ కార్యదర్శి దూళ్ల నరసింహారావు, కమిటీ సభ్యులు యక్కల శ్రీమన్నారాయణ, పొత్తూరు నాగేంద్రం , అవ్వారు లత, కొత్త దీప్తి, కాజా శివప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు.

ప్రతిభావంతులైన విద్యార్థినులకు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద సన్మానించారు. నగరానికి చెందిన అరసపల్లి వెంకట కోటేశ్వరరావు తనయ మోహనశ్రీ టెన్త్‌లో 589 మార్కులతో పాటు సయ్యద్ అహ్మద్ తనయ ఆఫ్రిన్ టెన్త్‌లో 583 మార్కులు సాధించినట్లు కన్నా మిత్ర మండలి అధ్యక్షుడు జి.కన్న తెలిపారు. అదే విధంగా అరసపల్లి రాధాదేవి సీనియర్ ఇంటర్‌లో 981 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు టెన్త్; ఇంటర్‌లలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు సాంబశివరావు, గుంటక శ్రీనివాసరెడ్డి, గురువారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పొట్టి నాగేశ్వరరావు, శ్రీహరి, ఆదినారాయణ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం రాత్రి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెల వారి కార్యక్రమంలో భాగంగా యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కుమారి మల్లాది సింధురాగేశ్వరి శ్రీత్యాగరాజస్వామి కీర్తనలు, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా అలరించారు. వయోలిన్‌పై కె.కామాక్షి(విజయవాడ), మృదంగంపై మల్లాది శివానంద యశస్వి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ సత్కరించారు.

భావ వ్యక్తీకరణకు భాష కీలకం



ఆచార్య కృపాచారిని సత్కరించిన అసోసియేషన్ నేతలు

తెనాలి: అక్షరం భాషకు ప్రాణం పోస్తుందని, అలాంటి భాషను అచ్చుయంత్రం అజరామరం చేసిందని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఆదివారం రాత్రి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'మానవ వికాసంలో ముద్రణా వికాసం' అనే అంశంపై ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రత్యేక ప్రసంగం చేశారు. మానవ వికాసంలో భాష ప్రాధాన్యత, అందుకు తోడ్పడిన ముద్రణా పరిణామాన్ని సోదాహరణంగా వివరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, చలమయ్య, వాకా పేరిరెడ్డి, అజ్గర్‌అలీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ ఎక్లేవ్ భవనం ఆవరణలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరం కొనసాగించారు. పేర్లు నమోదు చేసుకున్న 300 మందికి సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ డి.శారద ఉచితంగా బీపీ, షుగరు, ఫిజియోథెరపీ పరీక్షలు చేశారు. ఈసీజీ తీశారు. అవసరమైన వారికి నెలకు సరిపడ బీపీ, కాల్షియం, విటమిన్ మందులు ఉచితంగా అందజేశారు. అల్పాహారం సమకూర్చారు. పావులూరి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు, భానుమూర్తి పాల్గొన్నారు.

ఉదయరాజుకు అభినందనలు



తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లి పట్టణానికి చెందిన కూరగంటి ఉదయరాజును నియమించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం అభినందనలు తెలిపారు. తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ తరుపున అభినందనలు తెలియజేసినట్లు పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి తెలిపారు. ఉదయరాజు స్పందిస్తూ.. సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించారని, వైఎస్సార్ సీపీ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, మంగళగిరి కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, గుంటూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేక వెంకటరామిరెడ్డి, తాడేపల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్ తదితరులు అభినందనలు తెలిపారు.

డాక్టరేట్ అందుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి

తెనాలిరూరల్: హైదరాబాద్‌లోని తెలుగు సంస్కృతి సాంస్కృతిక సేవా సంస్థ గౌరవ డాక్టరేట్‌ను నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి ప్రదానం చేసింది. ఆదివారం సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంజీ శంకర్, సుబ్బరాయ శర్మ, ఉస్మానియా ఆచార్యులు డాక్టర్ కేసరి జనార్దనరావు, కమెడియన్ అప్పారావు డాక్టరేట్‌ను అందజేశారు.